సాక్షి సంగారెడ్డి
మంగళవారం ၊ 15 ၊ అక్టోబర్ ၊ 2024



బాధితులకు 'గోల్డెన్ అవర్'

సైబర్ క్రైమ్ జరిగిన మొదటి గంటలోనే (గోల్డెన్ అవర్) బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఫలితం ఉంటుంది.

వివరాలు 8లో ▸



సమస్యలను పరిష్కరించండి

ప్రజావాణిలో భాగంగా వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు.

వివరాలు 8లో ▸



కబళిస్తున్న కాలుష్య భూతం

కాలుష్య భూతం బుసలు కొడుతోంది. కట్టడి చేయాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

16న నారాయణఖేడ్‌లో దామోదర పర్యటన

నారాయణఖేడ్: నారాయణఖేడ్ నియోజకవర్గంలో ఈనెల 16న వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి తెలిపారు. ఆ రోజు ఉదయం 11.30 గంటలకు నిజాంపేట మండల కేంద్రంలో పీహెచ్‌సీ భవనం ప్రారంభించనున్నారని, మధ్యాహ్నం రెండు గంటలకు సిర్గాపూర్ మండలం వాసర్ గ్రామంలో రూ.125 కోట్లతో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాల భవనానికి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ పాల్గొంటారని తెలిపారు.

భారత రాజ్యాంగం ఎంతో గొప్పది

ఎంపీ సురేశ్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి



అంబేడ్కర్ విగ్రహావిష్కరణ చేస్తున్న ఎంపీ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): బీఆర్ అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగం ఎంతో గొప్పదని జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి అన్నారు. సోమవారం కల్హేర్ మండలం రాపర్తిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైవారు ప్రసంగించారు. అన్ని వర్గాల ప్రజలకు హక్కులు కల్పించేందుకు అంబేడ్కర్ అహర్నిశలు శ్రమించి రాజ్యాంగాన్ని రూపొందించారని కొనియాడారు. కొన్ని సంఘ విద్రోహ శక్తులు రాజ్యాంగాన్ని తూట్లు పొడిచేలా పని చేస్తున్నాయని విమర్శించారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపైనా ఉందన్నారు. ఆ మహనీయుని బాటలో నడుచుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకుడు కై లస్‌బాబు, రచయిత పసునూరి రవీందర్, లంబాడ హక్కుల పోరాట సంఘం నాయకుడు ప్రకాశ్‌రాథోడ్, మాజీ ఎంపీపీ మల్లేశం, మాజీ సర్పంచ్ శ్రావణ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు దేవదాస్, పత్తిగారి శ్రీకాంత్, హన్మండ్లు, మాణిక్యం, ఆనందం తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై పోరాడేది సీపీఎం ఒక్కటే

పార్టీ జిల్లా కార్యదర్శి జయరాజ్



సభలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి జయరాజ్

జహీరాబాద్ టౌన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడేది సీపీఎం ఒక్కటేనని పార్టీ జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజ్ అన్నారు. జహీరాబాద్ ఏరియా మహాసభలు పట్టణంలోని భీంభవన్‌లో సోమవారం ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా మహాసభలకు ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో వాగ్దానాలు చేయడం అధికారంలోకి వచ్చిన తరువాత రాజకీయ పార్టీలు వాటిని విస్మరించడం పరిపాటిగా మారిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులో నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. ఇప్పటికైనా వాటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పేదల భూములను తీసుకుని ప్రభుత్వం పెద్దలకు అప్పగిస్తున్నారన్నారు. అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ముందుగా అనారోగ్యంతో మృతి చెందిన కామ్రేడ్ సీతారాం ఏచూరికి మహాసభ తరఫున నేతలు నివాళులర్పించింది. పార్టీ ఏరియా కమిటీ కార్యదర్శి బి.రాంచందర్, సభ్యులు మహిపాల్, నర్సయ్య, చంద్రన్న, కనకారెడ్డి శంకర్, వీరయ్యగౌడ్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్కారు సీరియస్

సంజీవన్‌రావుపేట ఘటనలో ఇద్దరు ఇంజనీర్లపై వేటు

- గ్రామ పంచాయతీ కార్యదర్శిపై కూడా..
- స్పెషల్ ఆఫీసర్‌కు ఆర్టికల్ ఆఫ్ చార్జెస్.. ఎంపీఓకు షోకాజ్
- ఎస్‌ఈ రఘువీర్‌కు మెమో?
- కలుషిత తాగునీటి సరఫరాతో ఇద్దరు మృతి ఘటనపై చర్యలు



నారాయణఖేడ్: ప్రాంతీయ ఆస్పత్రిలో బాధితులను పరామర్శిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: కలుషిత తాగునీటి సరఫరాతో ఇద్దరు మృతి చెందిన ఘటనను సర్కారు సీరియస్‌గా తీసుకుంది. ఈ ఘటనకు కారణమైన మూడు శాఖలకు చెందిన అధికారులపై వేటు వేసింది. నారాయణఖేడ్ మండలం సంజీవన్‌రావుపేటలో అధికారులు సరఫరా చేసిన కలుషిత తాగునీరు సేవించి ఇద్దరు మృతి చెందిన విషయం విదితమే. మరో 50 మంది వరకు తీవ్ర అస్వస్థతకు గురి కాగా, ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనకు బాధ్యులైన మిషన్‌భగీరథ ఇంట్రా విలేజ్ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీకాంత్, గ్రిడ్ అసిస్టెంట్ ఇంజనీర్ రవికుమార్‌లను సస్పెండ్ చేస్తూ పంచాయతీరాజ్‌శాఖ నుంచి సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. అలాగే మిషన్‌భగీరథ పర్యవేక్షక ఇంజనీర్ రఘువీర్‌కు కూడా మెమో జారీ అయినట్లు సమాచారం. మిషన్ భగీరథ అధికారులు బావిలో చాలా రోజులుగా నిల్వ ఉన్న నీటిని తాగునీటి అవసరాల కోసం సరఫరా చేశారు. ఈ కలుషిత నీటిని తాగడంతో బీసీ కాలనీవాసులంతా వాంతులు, విరేచనలతో బాధపడ్డారు.

స్పెషల్ ఆఫీసర్‌పైనా చర్యలు

జిల్లా అధికార యంత్రాంగం కూడా ఈ ఘటనను తీవ్రంగా పరిగణించింది. తాగునీటి సరఫరా విషయంలో అలసత్వం వహించిన ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి నర్వ నాగలక్ష్మిని కూడా సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబ తెలిపారు. అలాగే నారాయణఖేడ్ మండలం స్పెషల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్న వయోజన విద్యాశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ కె.వెంకట్‌రెడ్డిపై ఆర్టికల్ ఆఫ్ చార్జెస్ ఫ్రేమ్ చేశారు. అలాగే నారాయణఖేడ్ మండలం ఎంపీఓ ఇందిరమ్మకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

అలసత్వానికి అమాయకులు బలి

తాగునీటి సరఫరా విషయంలో అధికారుల అలసత్వానికి అమాయక గ్రామ ప్రజల ప్రాణాలు గాలిలో కలిశాయి. ఏకంగా ఇద్దరు మృతి చెందడంతో పాటు, 50 మందికి పైగా తీవ్ర అస్వస్థతకు గురవడం జిల్లాలో కలకలం రేపింది. మిషన్‌భగీరథ తాగునీటి సరఫరా చేసే మోటారు చెడిపోయి పక్షం రోజులు గడుస్తున్నా మిషన్‌భగీరథ అధికారులు వాటికి మరమ్మతులు చేపట్టలేదు. పైగా గ్రామంలో పాడుబడిన బావిలో ఉన్న నీటితో ట్యాంకు నింపి వాటిని తాగునీటి సరఫరా చేశారు. ఇలా బావి నీటిని సరఫరా చేసే టప్పుడు కనీసం ఆ నీటిని ఎస్2హెచ్ పరీక్ష నిర్వహించాలి. ఆ నీరు తాగేందుకు వీలవుతుందా? లేదా? అందులో ఏమైనా హానికరమైన బ్యాక్టీరియా ఉందా అనేది నిర్ధారించుకున్నాకే తాగునీటి అవసరాల కోసం సరఫరా చేయాలి. కానీ ఇవేవి పట్టించుకోని మిషన్‌భగీరథ అధికారులు చాలా రోజులుగా బావిలో నిల్వ ఉన్న కలుషిత నీటిని సరఫరా చేశారు. అలాగే గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించడంలో ఇటు పంచాయతీశాఖకు చెందిన అధికారులు కూడా ఇదే తీరుగా వ్యవహరించారు. నీటి పరీక్షలు పక్కన బెడితే.. బావి నీటి చూస్తేనే పూర్తిగా కలుషితమైనట్లు తెలుస్తుంది. కానీ ఇవేవీ పట్టించుకోని క్షేత్ర స్థాయి అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించి నిండు ప్రాణాలను బలయ్యేందుకు కారణమయ్యారు. అలాగే క్షేత్ర స్థాయిలో ఏం జరుగుతుందో అనే దానిపై జిల్లా ఉన్నతాధికారులు సైతం కనీస పర్యవేక్షణ కరవవడంతో ఈ దారుణం చోటు చేసుకుందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

తప్పును కప్పిపుచ్చుకునే ప్రయత్నం

ఈ ఘటన విషయంలో మిషన్‌భగీరథ అధికారుల తీరు తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ఈ కలుషిత నీటిని తాగి ఇద్దరు మృతి చెంది, పదుల సంఖ్యలో ఆసుపత్రుల పాలైనప్పటికీ ఈ అధికారులు తప్పును కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేశారు. ఈ గ్రామంలో సరఫరా అయిన నీటి నమూనాలను సేకరించి పరీక్ష ఎస్2హెచ్ పరీక్ష నిర్వహించగా నార్మల్‌గానే వచ్చిందని, తాగేందుకు ఎలాంటి ఇబ్బంది లేదనే ఫలితాలు వచ్చాయని మిషన్ భగీరథ ల్యాబ్ నివేదిక ఇవ్వడం గమనార్హం. కాగా బ్యాక్టీరియల్ టెస్ట్ రిపోర్టులు మంగళవారం వచ్చే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.



నారాయణఖేడ్: అధికారులతో కలిసి సంజీవన్‌రావుపేట్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సత్ఫలితాలు ఇవ్వని భగీరథ

- ఎమ్మెల్యే సంజీవరెడ్డి
- రూ.3 కోట్లతో కొత్తపైప్‌లైన్ నిర్మాణానికి ప్రతిపాదనలు
- అదనపు కలెక్టర్‌తో కలిసి సంజీవన్‌రావుపేటలో పర్యటన

నారాయణఖేడ్: బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్‌భగీరథ పథకం సత్ఫలితాలు ఇవ్వడంలేదని అందుకు నిదర్శనమే సంజీవన్‌రావుపేట ఘటన అని ఎమ్మెల్యే సంజీవరెడ్డి పేర్కొన్నారు. నారాయణఖేడ్ మండలం సంజీవన్‌రావుపేటలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఆర్డీఓ అశోక చక్రవర్తి, మిషన్ భగీరథ పథకం ఎస్ఈ రఘువీర్, ఈఈ బాషా, డిప్యూటీ ఈఈ ఫణివర్మ, గ్రిడ్ డిప్యూటీ ఈఈ గాయత్రి, తహసీల్దార్ భాస్కర్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి తదితర అధికారులతో కలిసి పర్యటించారు. పారిశుధ్యం, తాగు నీటిసరఫరా పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లోని పలు కాలనీలు, తండాలకు పైపులైన్లు వేయలేదన్నారు. వేసిన పైపులైన్లు పలు చోట్ల లీకవుతుండటంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని పేర్కొన్నారు. సంజీవన్‌రావుపేటలో పాతట్యాంకుకు మిషన్ భగీరథ నీళ్ల ఎక్కడం లేదంటూ బీఆర్ఎస్ హయాంలో బావి నీటిని సరఫరా చేస్తూ వస్తున్నారన్నారు. ఆదివారం అర్ధరాత్రి వరకు పనులు చేసి పాతట్యాంకుకు భగీరథ నీటిని అధికారులు ఎక్కించి చేసిన ట్రయల్స్ విజయవంతమైందన్నారు. గ్రామం మొత్తానికి స్వచ్ఛమైన నీటిని అందించడం జరుగుతుందన్నారు. ఖేడ్ నియోజకవర్గంలో ఇదివరకే పైపులైన్లు లేని కాలనీలు, తండాలకు కొత్త పైపులైన్లు వేసి తాగునీటిని అందించడానికి రూ.3 కోట్లతో ప్రతిపాదనలు పంపామన్నారు. అదనపు కలెక్టరు చంద్రశేఖర్ మాట్లాడుతూ పాతట్యాంకు ద్వారా 120 ఇళ్లకు తాగునీటిని సరఫరా చేయగా.. ఆయా ఇళ్లవారే అస్వస్థతకు గురయ్యారన్నారు. 25 మంది వరకు అస్వస్థతకు గురికాగా వారి ఆరోగ్యపరిస్థితి బాగుందన్నారు. ఇద్దరు మృతిచెందిన విషయంలో ఆరోగ్య సమస్యలు కారణమని తెలుస్తోందన్నారు. ఈ ఘటనపై విచారణ జరుగుతోందని చెప్పారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల మధ్య వాగ్వాదం

గ్రామంలో ఎమ్మెల్యే, అధికారులు పర్యటిస్తున్న సమయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణుల మధ్య వాగ్వాదాలు జరిగాయి. ఘటనకు మీ ప్రభుతం కారణమంటే మీ ప్రభుత్వం కారణమంటూ వాదులాడుకున్నారు. పోలీసులు జోక్యం చేసుకుని ఇరుపార్టీల వారిని పక్కకు జరపడంతో వాగ్వాదం సద్దుమణిగింది.

బాధితులకు పలువురి పరామర్శ

అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నవారిని జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, అదనపు కలెక్టరు చంద్రశేఖర్, ఎస్ఆర్ఐ గుర్రపు మశ్చందర్, సీపీఎం, సీపీఐ నాయకులు వేర్వేరుగా పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్‌కు సూచించారు.



అలయ్ బలయ్ కార్యక్రమంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే క్రాంతి, తదితరులు

పేదల కడుపు కొట్టడమేనా?

- కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజం
- హామీల అమలులో విఫలం
- అందోల్‌లో ధూంధాంగా అలయ్ బలయ్

జోగిపేట(అందోల్): ప్రతి పేదవాడికి కడుపునిండా అన్నం పెట్టాలనే ఆలోచనతో కేసీఆర్ పాలన సాగిందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం పేదవాడి కడుపు కొట్టుతూ రాక్షస పాలనా సాగిస్తున్నదని బీఆర్ఎస్ అగ్రనేత, ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు అన్నారు. సోమవారం అందోల్‌లో మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అలయ్ బలయ్‌కి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ పది నెలల పాలనలో ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. పండుగలను ప్రశాంతంగా జరుపుకోలేని దయనీయ పరిస్థితి తెలంగాణలో ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. బతుకమ్మలకు చీరలు ఇవ్వలేని పరిస్థితి ఉన్నదని, గత ప్రభుత్వం ఒక చీర ఇస్తే తాము రెండు చీరలు ఇస్తామన్నారని, తర్వాత రూ.500 ఇస్తామన్నారని, కానీ చీరలు ఇవ్వలేదు.. రూ.500 ఇవ్వలేదని ఆయన విమర్శించారు. ఏ ఒక్క హామీని సక్రమంగా అమలు చేయలేదని, రుణమాఫీ లేదు, ఉద్యోగుల ఊసే లేదన్నారు. ఇప్పటికీ రైతుబంధు వేయలేదని మంత్రులు సీఎంకు ప్రజల సంక్షేమంపై ధ్యాసే లేదన్నారు. పదేళ్ల కాలంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో ఎంతో అభివృద్ధి చెందిందని...కానీ నేడు అభివృద్ధి మాటే లేన్నారు. ప్రభుత్వం ప్రజల పక్షాన నిలబడి వారి కష్టాలు తొలగించాలని, అయితే.. కాంగ్రెస్ ప్రభుత్వం వారికి కొత్త కష్టాలు తెచ్చి పెడుతున్నదని విమర్శించారు. గత ప్రభుత్వం నారాయణఖేడ్ లాంటి వెనుకబడిన ప్రాంతానికి మిషన్ భగీరథ ద్వారా తాగడానికి మంచి నీళ్లు ఇచ్చిందని, కానీ నేడు మంచినీళ్లు దొరక్క బావిలో కలుషితమైన నీరు తాగి ఇద్దరు మృతి చెంది మరెందరో ఆసుపత్రుల పాలయ్యారని హరీశ్ గుర్తు చేశారు. అలయ్ బలయ్ సందర్భంగా ఎమ్మెల్సీ, కవి గాయకులు దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆటపాటలతో హోరెత్తించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పార్టీ శ్రేణులు, కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, వంటేరు యాదవరెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, మంజుశ్రీ, శివకుమార్, పి.నారాయణ, ఖమ్రుద్దీన్, డీబీ నాగభూషణం, ఎం.మల్లికార్జున్, మీనాక్షి, రాహుల్ కిరణ్, పి.శివశేఖర్, బుచ్చిరెడ్డి, మండల అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సార శ్రీధర్, మాజీ అధ్యక్షుడు వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

దసరా కిక్కు

- జిల్లాలో రూ.45కోట్ల మద్యం అమ్మకాలు
- కిక్కిరిసిన మద్యం, మాంసం దుకాణాలు



జిల్లాలో మద్యం అమ్మకాలు (మూడు రోజులలో కేసులు)

నియోజకవర్గం	ఐఎంఎల్	బీరు	విలువ రూ.లక్షల్లో
అందోల్	1,967	3,923	208.78
నారాయణఖేడ్	2,185	1,934	186.88
పటాన్‌చెరు	8,929	13,361	891.06
సంగారెడ్డి	3,718	5,212	365.04
జహీరాబాద్	3,329	3,392	271.85

నియోజకవర్గం	వైన్ షాపులు	బార్లు
సంగారెడ్డి	23	6
పటాన్‌చెరు	34	22
జహీరాబాద్	17	4
నారాయణఖేడ్	13	1
అందోల్	14	1
మొత్తం	101	34

సంగారెడ్డి జోన్: దసరా పండుగను పురస్కరించుకొని మద్యం అమ్మకాలు జోరుగా సాగాయి. జిల్లా వ్యాప్తంగా రూ.45.60కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. ప్రధానంగా మూడు రోజులపాటు అత్యధికంగా అమ్మకాలు జరిగినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. మద్యం అమ్మకాలు జోరుగా సాగటంతో వైన్ షాపులు, బార్లు కొనుగోలుదారులతో కిక్కిరిసిపోయాయి. జిల్లా వ్యాప్తంగా 34 బార్లు, 101 వైన్ షాపులు ఉన్నాయి. ఆయా దుకాణాలలో మద్యం విక్రయాలు జోరుగా సాగడంతో ప్రభుత్వానికి ఆదాయం సమకూరింది. అక్టోబర్ ఒకటో తేదీ నుంచి 11 వరకు రూ. 45కోట్ల 60 లక్షల అమ్మకాలు జరగా.. ఆఖరి మూడు రోజుల్లోనే రూ.19కోట్ల విలువైన 27,882 బీర్లు, లిక్కర్ (ఐఎంఎల్) 20,028 కేసులు అమ్మకాలు జరిగాయి. కొంతమంది ముందస్తుగానే స్టాక్ నిల్వలు ఉంచుకున్నారు. అమ్మకాలను దృష్టిలో ఉంచుకుని దుకాణాదారులు ముందుగానే డిపోల నుంచి స్టాక్ తెప్పించుకుని, నిల్వలు ఉంచుకున్నారు. పట్టణాల నుండి గ్రామాలకు ప్రజలు రావటంతో ఆదివారం సెలవు కలిసి రావటంతో సంబురాలు ఫుల్ జోష్‌గా సాగాయి. కాగా, మద్యంతో పాటు మాంసం అమ్మకాలు సైతం జోరుగా సాగాయి. ఆయా దుకాణాల వద్ద చికెన్, మటన్‌లకు అధికంగా కొనుగోళ్లు చేశారు.

విహార యాత్రలకు గ్రీన్ సిగ్నల్

- తెలంగాణ దర్శినికి శ్రీకారం
- పర్యాటక ప్రాంతాలకు ప్రాధాన్యత
- ఖర్చు బాధ్యత ప్రభుత్వానిదే



కొండాపూర్‌లోని మ్యూజియం

సంగారెడ్డి ఎడ్యుకేషన్: స్థానికంగా ఉన్న పర్యాటక , సాంస్కృతిక, చారిత్రక ప్రాంతాలపై విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ దర్శిని అమలుకు శ్రీకారం చుట్టింది. గతంలోనూ ఇదే తరహాలో ప్రతి పాఠశాలలో సంవత్సరానికి ఒకసారి విద్యార్థులను విహారయాత్రల పేరుతో పర్యాటక ప్రాంతాలకు తీసుకెళ్లేవారు. అయితే కొన్ని అపశృతులు చోటుచేసుకోవడంతో అప్పటి ప్రభుత్వం ఈ విహార యాత్రలకు బ్రేక్ వేసింది. దీంతో కొన్నేళ్లుగా విద్యార్థులు పర్యాటక ప్రాంతాలను చూసే వీలు లేకుండా పోయింది. స్థానిక పర్యాటక రంగంపైనే కాకుండా మానసిక ఉల్లాసాన్ని ఇచ్చే కార్యక్రమాలు చేపట్టకపోవడంతో విద్యార్థులకు పర్యాటక, చారిత్రక, సాంస్కృతిక రంగాలపై కనీస అవగాహన లేకుండా పోతోంది. వీటన్నంటిని దృష్టిలో ఉంచుకొని ప్రస్తుత ప్రభుత్వం విద్యార్థులకు మానసిక ఉల్లాసాన్ని కలిగించేందుకు తెలంగాణ దర్శిని కార్యక్రమం ద్వారా విద్యా, వైజ్ఞానిక, విహార యాత్రలకు తీసుకెళ్లేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

సెలవు రోజుల్లోనే..

విద్యార్థులకు చారిత్రక పర్యాటక స్థలాపైనే కాకుండా ఆయా ప్రాంతాల్లోని ప్రసిద్ధి చెందిన వాటిపై అవగాహన పెంచేందుకు తెలంగాణ దర్శిని కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడనుంది. విద్యార్థులకు చదువు పరంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కేవలం సెలవు రోజుల్లో మాత్రమే పాఠశాలలు ఆయా తరగతుల వారీగా విహార యాత్రలకు తీసుకెళ్లనున్నాయి. గతంలో ఈ విహారయాత్రలకు వెళ్లాలంటే ఉపాధ్యాయులు విద్యార్థుల దగ్గరే డబ్బులు వసూలు చేసేవారు. ప్రస్తుతం ప్రభుత్వమే ఖర్చు భరించనుంది.

పర్యాటక ప్రదేశాలు ఇవే..

తెలంగాణ దర్శిని కార్యక్రమంతో జిల్లాలో గల పర్యాటక ప్రదేశాలకు మహర్దశ రానుంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో మంజీరా అభయారణ్యం, సింగూరు ప్రాజెక్టు, దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన ఝరాసంఘంలోని సంగమేశ్వర ఆలయం, గతంలో కొండిన్యులు పరిపాలించిన కొండాపూర్‌లో మ్యూజియం, ఆసియా ఖండంలోనే అతిపెద్దదైన మెదక్ చర్చి, కొండపోచమ్మ, మల్లన్నసాగర్‌తో పాటు హైదరాబాద్‌కు సమీపంలో నగర శివారులో గల పలు వాటర్‌ఫాల్స్, గార్డెన్స్, పార్కులు వంటి ప్రదేశాలు ఉన్నాయి. విహార యాత్రలో భాగంగా పాఠశాల విద్యార్థులు వీటిని వీక్షించే అవకాశం ఉంది.

ఎలాంటి అధికారిక జీఓ రాలేదు: డీఈవో

తెలంగాణ దర్శినిపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక జీఓ అయితే రాలేదు. జీఓ వచ్చిన తరువాత ఏ ఏ తరగతుల వారిని విహార యాత్రలకు తీసుకెళ్లాలి. విహార యాత్రలకు సంబంధించి ప్రభుత్వం ఏ మేరకు నిధులు విడుదల చేస్తుందనే తెలియదు. జీఓ వచ్చిన తరువాత ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు కార్యక్రమాన్ని అమలు చేస్తాం.

అందోల్‌ను అభివృద్ధి చేస్తా..

- రూ.433 కోట్ల పనులకు త్వరలో శంకుస్థాపన
- మంత్రి దామోదర రాజనర్సింహ



మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ

సంగారెడ్డి : దసరా పండుగ సందర్భంగా చౌటకూరు మండలం సుల్తాన్‌పూర్ ఎంఎస్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం అలయ్ బలయ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి దామోదర రాజనర్సింహ హాజరు కాగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అందోలు నియోజకవర్గంలో రూ.433 కోట్ల అభివృద్ధి పనులకు మరో 10 రోజుల్లో శంకుస్థాపన చేయబోతున్నట్లు తెలిపారు. రూ.168 కోట్లతో సింగూరు కాల్వకు సిమెంట్ లైనింగ్, పుల్కల్ మండలం బస్వాపూర్ వద్ద 25 ఎకరాల విస్తీర్ణంలో రూ.125 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, రాయికోడ్‌లో రూ.15 కోట్లతో అత్యాధునిక గోదాం, బోరంచ ఎత్తిపోతల పథకానికి రూ.7 కోట్లు, అందోలు వద్ద 60 సీట్ల భర్తీతో నర్సింగ్ కళాశాలకు రూ.43 కోట్లు, 150 పడకల ఆస్పత్రికి రూ.60 కోట్లు, సుల్తాన్పూర్ జేఎన్టీయూలో జిల్లా సైన్స్ సెంటర్ ఏర్పాటుకు రూ.15 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. రానున్న మూడు నెలల్లో జరుగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు కలిసికట్టుగా ఉండి అభ్యర్థులను గెలిపించేందుకు కష్టపడాలని సూచించారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి తోపాజి అనంత కిషన్, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు దుర్గారెడ్డి, నత్తి దశరథ్, శివరాజ్, నాయకులు లక్ష్మారెడ్డి, నాయకుని గోవర్ధన్, మల్లారెడ్డి, రామ్ రెడ్డి, ఈశ్వర్ గౌడ్ సార గోవర్ధన్, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తప్పిపోయిన చిన్నారులు అప్పగింత



చిన్నారులను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

మర్కూక్(గజ్వేల్): అనుమానాస్పదంగా రోడ్డుపై ఏడుస్తూ కనిపించిన ముగ్గురు చిన్నారులను మర్కూక్ పోలీసులు చేరదిసి తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాల్లోకి వెళ్తే.. బీహార్‌కు చెందిన నిఖిలేష్, విశాల్, నిర్మల మేడ్చల్ జిల్లా మూడుచింతల పల్లి మండలకేంద్రంలో కూలీ పని చేసుకుంటూ నివాసం ఉంటున్నారు. ఆదివారం మండలంలోని కర్కపట్ల గ్రామంలో కూరగాయల మార్కెట్‌కు తమ పిల్లలు నీసా, శివాని, శివతోపాటు వెళ్లారు. కూరగాయలు తీసుకుంటున్న సమయంలో పిల్లలు తప్పిపోయారు. తల్లిదండ్రులు గమనించి చుట్టుపక్కల వెతికారు. అదే సమయంలో పెట్రోలింగ్‌కు వెళ్లిన పోలీసులకు చిన్నారులు ఏడుస్తూ అనుమానాస్పదంగా కనిపించారు. వెంటనే వారిని చేరదిసి కర్కపట్ల గ్రామ పంచాయతీలో పడుకోబెట్టి సోమవారం ఉదయం మర్కూక్ పోలీస్ స్టేషన్ తీసుకొచ్చారు. ముగ్గురి నుంచి వివరాలు సేకరించి మూడుచింతలపల్లికి వెళ్లి వారి తల్లిదండ్రులకు సమాచారం అందించి అప్పగించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ రవీందర్, సిబ్బంది జ్యోతి ఉన్నారు.

ఆటోకు నిప్పు

టేక్మాల్(మెదక్): గుర్తు తెలియని దుండగులు ఆటోకు నిప్పంటించిన ఘటన మండలంలోని ఎల్లుపేట గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కొటగిరి వెంకట్‌గౌడ్ వ్యవసాయంతోపాటు బజాజ్ ప్యాగో ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. పొద్దంతా ఆటో నడుపుతూ రాత్రి ఇంటి ఎదుట పార్కింగ్ చేసేవాడు. నిత్యం మాదిరిగానే ఆదివారం పార్కింగ్ చేసిన ఆటోను గుర్తు తెలియని దుండగులు నిప్పటించారు. గమనించిన చుట్టుపక్కల మంటలార్పే ప్రయత్నం చేసినా అప్పటికే కాలిపోయింది. ఈ విషయమై సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వాటర్‌షెడ్డే మేలు

బీజేపీ నేత మర్రి శశిధర్‌రెడ్డి
గొటిగార్‌పల్లి వాటర్‌షెడ్ పనుల పరిశీలన


గోటిగార్‌పల్లిలో వాటర్ షెడ్ ద్వారా చేపట్టిన పనులను పరిశీలిస్తున్న మర్రి శశిధర్‌రెడ్డి

జహీరాబాద్ టౌన్: లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల కన్నా చతుర్విదా జలవిధానం (వాటర్ షెడ్) వల్లే పేదలు, రైతులకు మేలు జరుగుతుందని జాతీయ ప్రకృతి విపత్తుల నివారణ సంస్థ మాజీ చైర్మన్, బీజేపీ నేత మర్రి శశిధర్‌రెడ్డి అన్నారు. కోహీర్ మండలం గోటిగార్‌పల్లి ప్రాంతంలో వాటర్‌షెడ్ ద్వారా గతంలో చేపట్టిన పనులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజస్తాన్ రాష్ట్రంలో ప్రజలు వర్షంపై ఆధారపడి ఒక పంట వేసేవారని, చతుర్విదా జలవిధానం (వాటర్ షెడ్ ప్రాజెక్టు) వల్ల నీటి నిలువలు పెరగడంతో రైతులు మూడు పంటలు వేస్తున్నారని చెప్పారు. వాటర్ షెడ్ పనుల వల్ల భూగర్భజలాలు పెరుగుతాయన్నారు. రైతులు, పేదలకు మేలు జరగాలంటే రాష్ట్ర ప్రభుత్వం లిఫ్ట్ ఇరిగేషన్ పనులను పక్కన పెట్టాలన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు వల్ల కాంట్రాక్టులకు మేలు జరుగుతుందని ఆరోపించారు. రాష్ట్రంలోని రైతులకు అన్ని రకాలుగా మేలు జరగాలంటే వాటర్ షెడ్ ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలని కోరారు. అంతకు ముందు ఆయన గొటిగార్‌పల్లి ప్రాంతంలో వాటర్ షెడ్ ద్వారా చేపట్టిన పనులను పరిశీలించారు. ప్రముఖ పర్యావరణ వేత్త ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి, ప్రొఫెసర్ మురళి మనోహర్, డాక్టర్ రాంకిషన్, బీజేపీ అధికార ప్రతినిధి వేణుగోపాల్‌రెడ్డిలు ఉన్నారు.

బాధితులకు 'గోల్డెన్ అవర్'

సైబర్ నేరాల బారిన పడిన బాధితులకు తెలంగాణ సైబర్ బ్యూరో అండగా నిలుస్తుంది. సైబర్ క్రైమ్ జరిగిన మొదటి గంటలోనే (గోల్డెన్ అవర్) బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఫలితం ఉంటుందని చెబుతారు. ఇందుకు గాను అవగాహన కల్పిస్తున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి అక్టోబర్ వ్యవధిలోనే జిల్లాలో 578 సైబర్ క్రైమ్ ఎఫ్ఐఆర్ కేసులు నమోదయ్యాయి. అత్యధికంగా అమీన్‌పూర్, పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో నమోదు కాగా.. మోసపోయిన వారంతా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, యువతే కావడం గమనార్హం.

సైబర్ మోసాల్లో మొదటి గంట కీలకం

- ఆ లోపు ఫిర్యాదు చేస్తే రికవరీ
- 1930కు ఫోన్ చేయాలంటున్న సైబర్ బ్యూరో
- అవగాహన కల్పిస్తూ సూచనలు
- జనవరి నుంచి అక్టోబర్ వరకు 578 ఎఫ్ఐఆర్‌లు
- రూ.2.26 కోట్లు రికవరీ


లోక్ అదాలత్‌లో రికవరీ చేసిన నగదును బాధితులకు అందజేస్తున్న డీఎస్పీ (ఫైల్)

పటాన్‌చెరు టౌన్ : గతంలో డబ్బులు కొట్టేశారు. ప్రస్తుతం మారుతున్న పరిస్థితుల్లో సైబర్ మోసాలకు పాల్పడుతున్నారు. పార్ట్‌టైమ్ జాబ్‌లు, కమీషన్లు, టాస్కులు.. ఇలా రోజుకో కొత్త ఆలోచనలను అమలు చేస్తూ జేబులుగుల్ల చేస్తున్నారు. బాగా చదువుకొని సాఫ్ట్‌వేర్, ప్రైవేట్, ఉద్యోగాలు చేస్తున్న వారిని, ఇతర దేశాల్లో ఉన్నత చదువులు చదువుతున్న వారి సమాచారం తెలుసుకొని విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేసి మీ అబ్బాయి కేసుల్లో ఇరుకున్నాడని డబ్బులు చెల్లించాలని భయపెడుతున్నారు. మరో వైపు డ్రగ్స్ కేసులో ఉన్నావంటూ బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నారు

578 ఎఫ్ఐఆర్‌లు

సైబర్ క్రైమ్ జరిగిన గంటల్లోనే (గోల్డెన్ అవర్) బాధితులు ముందుగా 1930కు సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు ఫిర్యాదు చేయాలి. అనంతరం వారి పరిధిలోకి వచ్చే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు అందజేయాలి. ఈ రకంగా సైబర్ మోసం జరిగిన మొదటి గంటలో ఫిర్యాదు చేస్తే బ్యాంక్ అకౌంట్ ఫ్రీజ్ చేసి బాధితులకు న్యాయం చేయడానికి ఎక్కువ అవకాశం ఉంటుందని సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు చెబుతున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 578 ఎఫ్ఐఆర్‌లు కాగా అందులో 88 కేసుల్లో రూ.2 కోట్ల 26 లక్షలు రికవరీ చేసి బాధితులకు నగదు అందజేసి, 76 మందిని పీటీ వారెంట్ ద్వారా రిమాండ్ చేశారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను అప్రమత్తం చేసేందుకు సైబర్ సెక్యూరిటీ బ్యూరో అవగాహన కార్యక్రమాలు చేపడుతుంది. ఎప్పటికప్పుడూ సమావేశాలు నిర్వహించి సూచనలు చేస్తున్నారు.

పలు రకాలుగా మోసాలు

- డ్రగ్స్ కేసులో ఉన్నావంటూ, మనీలాండరింగ్ కేసులో అనుమానితుడిగా ఉన్నావంటూ బెదిరింపులకు పాల్పడి, మీ పేరు తప్పించేందుకు డబ్బులు ఇవ్వాలని భయభ్రాంతులకు గురి చేస్తున్నారు.
- పార్ట్ టైమ్ జాబ్ పేరుతో టాస్కులు ఇస్తూ, నగదు ఇన్వెస్ట్ చేయిస్తూ, అధిక డబ్బు సంపాదించొచ్చని ఆశ చూపిన ఘటనలో ఇటీవలె మోసపోయిన వారే అధికం.
- కొందరు సైబర్ నేరగాళ్లు ఏటీఎం కార్డు, డెబిట్ కార్డు అప్డేట్ చేయాలని వివరాలను సేకరించి ఓటీపీలు అడిగి బాధితుడి బ్యాంక్ ఖాతా నుంచి డబ్బులను మాయం చేస్తున్నారు.
- ఆన్‌లైన్ ఉద్యోగాలు, పార్ట్ టైమ్ జాబ్ అంటూ వచ్చిన మెసేజ్‌లకు స్పందించి సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కుతున్న బాధితులు.
- గూగుల్‌లో కస్టమర్ కేర్‌కు ఫోన్ చేసే క్రమంలో సైబర్ నేరగాళ్ల వలలో పడి మోసపోతున్నారు.

ఇటీవలె జరిగిన ఘటనలు..

- పటాన్‌చెరుకు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి ఆగస్టు 29వ తేదీన అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్ కాల్ వచ్చింది. కస్టమ్స్ డిపార్ట్‌మెంట్ నుంచి కాల్ చేస్తున్నామని, మీపై అక్రమ డ్రగ్స్ రవాణా అలిగేషన్ ఉందని, అదే విధంగా మనీ లాండరింగ్ కేసులో మీ పేరు ఉందని బెదిరించారు. పేరు తప్పించేందుకు డబ్బులు ఇవ్వాలని భయభ్రాంతులకు గురిచేశారు.దీంతో బెరిదిపోయి ఆ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రూ.కోటి 58 లక్షల 47 వేలు పంపాడు. ఇంకా డబ్బులు వేయాలని ఒత్తిడి చేయడంతో సెప్టెంబర్ నెలలో సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.
- పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఓ ప్రైవేట్ ఉద్యోగికి జూలై 19వ తేదీన వాట్సాప్‌కు ఓ మెసేజ్ వచ్చింది. ఆన్‌లైన్‌లో ఇన్వెస్ట్ చేస్తే లాభాలు వస్తాయని ఆశ చూపారు. ఇది నమ్మిన బాధితుడు మొత్తం 22 దఫాలుగా రూ.2కోట్ల 43 లక్షలు ఇన్వెస్ట్ చేశాడు. అపరిచిత వ్యక్తి స్పందించకపోవడంతో బాధితుడు సైబర్ పోలీసులకు, పటాన్‌చెరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గోల్డెన్ అవర్‌లో ఫిర్యాదు చేయండి



సైబర్ నేరగాళ్ల చేతుల్లో మోసపోయిన వారు గోల్డెన్ అవర్(డబ్బు పోగొట్టుకున్న మొదటి గంట)లో ఫిర్యాదు చేయాలి. నిమిషాల వ్యవధిలో 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేస్తే, తక్షణ రిపోర్టింగ్ ద్వారా నిందితుల బ్యాంక్ ఖాతాలు లేదా డిజిటల్ వాలెట్లలో మోసం మొత్తాన్ని స్తంభింపజేసే అవకాశం ఉంటుంది. నగదు రీకవరీ సులభతరం అవుతుంది.

– వేణుగోపాల్ రెడ్డి, డీఎస్పీ, జిల్లా సైబర్ బ్యూరో


విద్యాశాఖ ఏడీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేయాలి

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో నెలకొన్న ఉపాధ్యాయుల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మల్లారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు పీఆర్టీయూ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా విద్యాశాఖ ఏడీ విజయకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో కొంతమంది ఉపాధ్యాయులు బదిలీ కాగా మరికొంతమంది ప్రమోషన్ పొందడంతో చాలా ఖాళీలు ఏర్పడ్డాయి. సబ్జెక్ట్ టీచర్ లేని ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలలో డీఎస్సీ 2024 ఉపాధ్యాయులను మొదటి ప్రాధాన్యతగా భర్తీ చేయాలని, సింగిల్ స్కూళ్లలో ట్రాన్స్‌ఫరైన ఉపాధ్యాయులను రిలీవ్ చేస్తూ ఆ పాఠశాలల్లో నూతన ఉపాధ్యాయులతో భర్తీ చేయాలని కోరారు. అలాగే విద్యార్థుల సంఖ్యకు కాకుండా సాంక్షన్ పోస్ట్ ఆధారంగా ఉపాధ్యాయ పోస్టులను నింపాలని డిమాండ్ చేశారు. ఆఫ్‌లైన్‌లోనే డీఎస్సీ 2024 కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టాలని, రెండు పోస్టులకు సెలెక్ట్ అయిన ఉపాధ్యాయుల నుంచి ఒక్క పోస్టుకు విల్లింగ్ లెటర్ తీసుకొని మిగిలిపోయిన మరొక పోస్టును తదుపరి వారితో నింపాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు శ్రీనివాస్, సంగమేశ్వర్, మెదక్ మండల ప్రధాన కార్యదర్శి సంతోష్, రాష్ట్ర కార్యదర్శి విక్రాంత్, తదితరులు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి


రమేశ్ (ఫైల్)

దుబ్బాకటౌన్: చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి ఘటన దుబ్బాక పట్టణంలో చోటు చేసుకుంది. సోమవారం దుబ్బాక ఎస్సై గంగరాజు కథనం మేరకు.. దుబ్బాక పట్టణానికి చెందిన పెంటం రమేశ్(35) చేపలు పడుతూ, పట్టణంలో గప్ చుప్ బండి నడుపుతూ భార్య రూప, కుమారుడు మన్విత్ రాజ్‌తో జీవిస్తున్నాడు. రమేశ్ దసరా పండుగ రోజు చేపల వేటకు వెళ్తున్నానని ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. భార్య పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో సోమవారం దుబ్బాక పట్టణంలోని ఏదుళ్ల చెరువు సమీపంలో రమేశ్ బైక్, చెప్పులు కనిపించాయి. చెరువులో గాలించగా రమేశ్ మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని దుబ్బాక ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

మురుగు కాల్వలో పడి వృద్ధుడు..


శంకర్ (ఫైల్)

మురుగు కాల్వలో పడి వృద్ధుడు మృతి చెందిన ఘటన దుబ్బాక పట్టణంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై గంగరాజు కథనం మేరకు.. దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేట వార్డుకు చెందిన పూస శంకర్(55) చేపలు అమ్ముకుంటూ భార్య రాధతో జీవిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం బంధువుల గ్రామమైన దుంపలపల్లికి పని నిమిత్తం సైకిల్ పై బయలుదేరాడు. దుబ్బాక పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపం సమీపంలో శంకర్ మురుగు కాల్వలో మూత్ర విసర్జన చేస్తూ ప్రమాదవశాత్తు కాల్వలో పడిపోయాడు. దీంతో ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందాడు. సోమవారం స్థానికులు చూసి పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. శంకర్ భార్య రాధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అతిగా మద్యం సేవించి..

గజ్వేల్‌రూరల్: అతిగా మద్యం సేవించి వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం గజ్వేల్ పట్టణంలో వెలుగు చూసింది. గజ్వేల్ పోలీసుల కథనం మేరకు.. పట్టణానికి చెందిన రాజొల్ల హరినాథ్(62) గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. ప్రజ్ఞాపూర్‌లోని మానస వైన్స్ పక్కన పడి ఉండటాన్ని గుర్తించిన మున్సిపల్ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పాముకాటుతో మహిళ


జ్యోతి (ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్) : పాముకాటుతో మహిళ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని దంతన్‌పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన గేడి జ్యోతి(28) ఆదివారం రాత్రి పశువులకు పాకలో పశుగ్రాసం వేసేందుకు గడ్డిని తీస్తుండగా నాగుపాము కాటు వేసింది. గుర్తించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలి భర్త తిరుపతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చెరువులో మునిగి వ్యక్తి..


రాములు (ఫైల్)

వర్గల్(గజ్వేల్): చెరువులో మునిగి వ్యక్తి మృతి చెందిన ఘటన వర్గల్ మండలం తున్కిమక్తలో వెలుగుచూసింది. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి కథనం మేరకు.. తున్కిమక్త గ్రామానికి చెందిన సుందు రాములు(58) ఆదివారం అదే గ్రామంలో బంధువు దశదినకర్మ కార్యక్రమానికి వెళ్లాడు. సాయంత్రం గ్రామ సమీపంలోని అంసోనికుంట చెరువులో స్నానం చేసేందుకు దిగి ప్రమాదవశాత్తు నీటమునిగాడు. చీకటి పడినప్పటికీ రాములు ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు, బంధువులు సోమవారం ఉదయం అంసోనికుంటలో వెతకగా మృతదేహం లభ్యమైంది. మృతుడి కుమారుడు మహేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

పిడుగుపాటుకు యువ రైతు


రవి (ఫైల్)

కల్హేర్(నారాయణఖేడ్): పిడుగుపాటుకు గురై యువ రైతు మృతి చెందిన ఘటన కల్హేర్ మండలం బీబీపేట్ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన సంగెం రవి(25) పశువులకు పచ్చి గడ్డి తీసుకు రావడానికి గ్రామ శివారులోని వ్యవసాయ భూమిలోకి వెళ్లాడు. పచ్చిగడ్డి కోస్తుండగా ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన పిడుగు పడింది. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో పోస్టల్ ఉద్యోగి..


నితిన్ కుమార్ (ఫైల్)

సిద్దిపేటఅర్బన్: అనుమానాస్పద స్థితిలో పోస్టల్ ఉద్యోగి మృతి చెందాడు. ఈ ఘటన సిద్దిపేట త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బూరుగుపల్లి శివారులో చోటు చేసుకుంది. త్రీటౌన్ పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. సిద్దిపేట పట్టణంలోని సుభాష్ నగర్‌కు చెందిన పేర్ల లక్ష్మి, రాజు దంపతులకు కుమారుడు పేర్ల నితిన్‌కుమార్ (22), కుమార్తె ఉన్నారు. నితిన్ జగదేవ్‌పూర్ మండలం చాట్లపల్లి గ్రామంలో బ్రాంచ్ పోస్ట్ మాస్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం స్నేహితుడితో కలిసి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా పవర్‌లూమ్ కాలనీలోని తాత పెంటయ్య ఇంటి వద్ద ఉన్నానని అక్కడే పడుకుంటానని చెప్పాడు. సోమవారం ఉదయం మరోసారి ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. కుటుంబ సభ్యులు, స్నేహితులు చుట్టుపక్కల వెతుకుతుండగా బూరుగుపల్లి శివారులోని వెలమ ఫంక్షన్ హాల్ వెనుక గల తిమ్మికుంట వద్ద చెప్పులు కనిపించాయి. పోలీసులు వచ్చి గజఈతగాళ్ల సాయంతో కుంటలో వెతకగా మృతదేహం లభ్యమైంది. అనుమానాస్పదంగా తమ కుమారుడు మృతి చెందాడని మృతుడి తండ్రి పేర్ల రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


గంజాయి మొక్కలు, నిందితుడితో ఎక్సైజ్ పోలీసులు

పంట చేనులో గంజాయి మొక్కలు

ధ్వంసం చేసిన ఎక్సైజ్ పోలీసులు

వెల్దుర్తి(తూప్రాన్) : వెల్దుర్తి మండలం శెట్టిపల్లి కలాన్ గ్రామశివారులో నిషేధిత గంజాయి మొక్కలు సాగుచేయడం కలకలం రేపింది. గుట్టుచప్పుడు కాకుండా పంటచేను వద్ద సాగు చేస్తున్న గంజాయి మొక్కలను ఎక్సైజ్ అధికారులు గుర్తించి ధ్వంసం చేశారు. రామాయంపేట ఎక్సైజ్ సీఐ రాణి కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఎలబోయిన భూపాల్ తన వ్యవసాయ పొలం వద్ద నిషేధిత గంజాయి మొక్కలు సాగు చేస్తున్నట్లు సమాచారం అందింది. ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆదేశంతో సోమవారం ఉదయం దాడులు నిర్వహించాం. ఈ క్రమంలో పొలం గట్టు, ఖాళీ ప్రదేశంలో సాగు చేస్తున్న 12 గంజాయి మొక్కలను గుర్తించి ధ్వంసం చేశాం. వాటిలో ఆరు సుమారు మూడు ఫీట్లు, మరో ఆరు మొక్కలు ఆరు ఫీట్ల వరకు ఉన్నట్లు గుర్తించాం. ఘటనకు సంబంధించి గంజాయి సాగు చేస్తున్న భూపాల్‌ను వెల్దుర్తి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. నిషేధిత గంజాయి సాగుచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. దాడిలో ఎక్సైజ్ ఎస్సై విజయ్‌సిద్దార్థ్, హెడ్ కానిస్టేబుల్ దుర్గారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

దొంగల బీభత్సం

పాఠశాలలో టీవీ, దాబాలో నగదు చోరీ


పరిశీలిస్తున్న క్లూస్ టీమ్ సిబ్బంది

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని చల్మెడ, కమాన్, నిజాంపేట గ్రామాల్లో దొంగలు బీభత్సం సృష్టించారు. పోలీసుల కథనం మేరకు.. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు దసరా సెలవుల సందర్భంగా తాళం వేశారు. సోమవారం పారిశుధ్య కార్మికులు శుభ్రం చేయడానికి రాగా గది తాళం పగులగొట్టి ఉంది. టీవీ ఎత్తుకెళ్లినట్లు గుర్తించి పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు ఆరుట్ల అరుణకు తెలిపారు. ఆమె స్థానిక పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశారు. అలాగే, చల్మెడ కమాన్ వద్ద గల ఓ దాబాలో గది తాళాలు పగులగొట్టి రూ.10వేలు ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. ఘటనా స్థలాన్ని క్లూస్‌టీం సిబ్బంది పరిశీలించి ఆధారాలు సేకరించారు.

తాళం వేసిన ఇంట్లో

సిద్దిపేటరూరల్: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన మండల పరిధిలోని మాచాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మాచాపూర్ గ్రామానికి చెందిన కోరె దేవయ్య శనివారం ఉదయం ఇంటికి తాళం వేసి వేరే గ్రామానికి వెళ్లాడు. ఆదివారం తిరిగి ఇంటికొచ్చాడు. తాళం పగులగొట్టి ఉండడాన్ని గుర్తించి లోపకి వెళ్లి చూడగా బీరువా తెరిచి బట్టలు చిందరవందరగా పడేసి ఉన్నాయి. బీరువాలో ఉన్న 2 తులాల నెక్లెస్, మరో 3 తులాల బంగారు అభరణాలు, 100 తులాల వరకు వెండి అభరణాలు గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం జరిగిందని తెలుసుకున్నాడు. దేవయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బట్టల షాపులో చోరీ

కౌడిపల్లి(నర్సాపూర్): తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడిన ఈ ఘటన మండల కేంద్రమైన చోటు చేసుకుంది. సోమవారం ఎస్ఐ రంజిత్‌రెడ్డి కథనం మేరకు.. కౌడిపల్లి గ్రామానికి చెందిన దేవిచంద్ బట్టల షాపు ఉండగా పైఅంతస్తులో కుటుంబ సభ్యులు ఉంటారు. ఆదివారం షాపు బంద్ చేసి గేట్‌కు తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి మెదక్ వెళ్లాడు. రాత్రి చూడగా ఇంట్లో ల్యాప్‌టాప్, మొబైల్ ట్యాబ్ కనిపించలేదు. ఇంటి పక్కన బిల్డింగ్ పైనుంచి గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి చోరీకి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సమస్యలను పరిష్కరించండి


పట్టా పాసు పుస్తకం అందజేస్తున్న కలెక్టర్ క్రాంతి

కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి జోన్: ప్రజావాణిలో భాగంగా వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అధికారులతో కలసి ఆమె ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. రెవెన్యూ, ధరణి, పింఛన్, రేషన్ కార్డులు తదితర సమస్యలపై ఎక్కువ దరఖాస్తులు వచ్చాయి. విజయదశమి పండుగ నేపథ్యంలో ప్రజావాణికి తక్కువ సంఖ్యలో వచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మాధురి, డీఆర్ఓ పద్మజ రాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పట్టా పాసు పుస్తకాలు అందజేత

ధరణి పోర్టల్ సమస్య కారణంగా పట్టాదారు పాస్ పుస్తకం కోసం నాలుగేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్న రైతు కుటుంబాలకు సోమవారం కలెక్టర్ కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు అందజేశారు. కొండాపూర్ మండలం గంగారం గ్రామానికి చెందిన కొల్ల లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, బల్వంత్ రెడ్డి ధరణి అమల్లోకి వచ్చినప్పటి నుంచి కొత్త పట్టాదారు పాసుపుస్తకం రాకపోవడంతో ఎలాంటి ప్రభుత్వ పథకాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రెండు నెలల క్రితం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ముగ్గురు రైతులు తమ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సమస్యకు పరిష్కారం చూపారు. కాగా, పట్టాపాసు పుస్తకాలు అందజేసిన కలెక్టర్ క్రాంతికి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయ స్థాయి యోగాకు గంగారం విద్యార్థులు

కొండాపూర్(సంగారెడ్డి): జాతీయ స్థాయి యోగాకు మండల పరిధిలోని గంగారం విద్యార్థులు మాధవి, శాకేరాలు ఎంపికైనట్లు జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు విజయ్ కుమార్, రమేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవలె పటాన్‌చెరులో జరిగిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు ఉత్తమ ప్రదర్శన నిర్వహించి రిథమిక్ యోగా విభాగంలో జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. నవంబర్ 11 నుంచి 14 వరకు అస్సాంలోని గౌహతీలో జరిగే పోటీల్లో పాల్గొంటారని యోగా అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు. జాతీయ స్థాయికి ఎంపిక కావడంపై పాఠశాల ఉపాధ్యాయ బృందంతోపాటు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.


మాధవి, శాకేరా

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

లారీ క్లినర్‌ను ఢీకొట్టిన ద్విచక్ర వాహనదారుడు


మల్లేశం (ఫైల్)

సిద్దిపేటకమాన్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన ఘటన సిద్దిపేట పట్టణ శివారులో చోటు చేసుకుంది. సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ కథనం మేరకు.. సిద్దిపేట అర్బన్ మండలం మందపల్లి గ్రామానికి చెందిన ముడికె మల్లేశం(32) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. దసరా పండుగ సందర్భంగా స్వగ్రామానికి వచ్చి మిట్టపల్లిలోని స్నేహితుల వద్దకు వెళ్లాడు. సోమవారం తెల్లవారుజామున రెండు గంటల సమయంలో తిరిగి స్వగ్రామానికి ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో బీదర్‌కు చెందిన లారీ క్లీనర్ రసూల్‌ఖాన్ (35) సిద్దిపేట పట్టణ శివారు కరీంనగర్ బైపాస్ రోడ్డులో తమిళనాడు హోటల్ వద్ద రోడ్డు పక్కన లారీని నిలిపాడు. హోటల్‌లో టీ తాగి తిరిగి లారీ వద్దకు వెళ్తుండగా అతివేగంగా ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టాడు. ప్రమాదంలో రసూల్‌ఖాన్‌కి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మల్లేశంను స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న అతడి కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ ఘటనలో మరో వ్యక్తి గణేశ్ సైతం గాయపడ్డాడు. ఈ ఘటనపై మృతుడు రసూల్‌ఖాన్ అన్న అంజద్‌ఖాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.